క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో 'మట్టల ఆదివారం'



మెట్టకూరులో ఈత చెట్ల ఆకులతో ప్రదర్శనల్లో పాల్గొన్న క్రైస్తవులు

యానాం: ఈస్టర్‌కు ముందు వచ్చే ఆదివారం రోజున నిర్వహించే పామ్ సండే (మట్టల ఆదివారం)ను యానాంలో పలు చర్చిల్లో క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్టకూరు మదర్ సుశీల మెమోరియల్ బాప్టిస్టు చర్చిలో రెవరెండ్ దొమ్మేటి సామ్యూల్‌సాగర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు, ఈత ఆకులను పట్టుకుని ప్రదర్శన నిర్వహించారు. పురాతన రోమన్ కేథలిక్ చర్చిలో ఫాదర్ మరియదాసు ఆధ్వర్యంలో పామ్ సండేను ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ నగర్ బాప్టిస్టు చర్చి, గోపాల్‌నగర్, కురసాంపేట, పరంపేట, దరియాలతిప్ప, దొమ్మేటిపేట, అయ్యన్ననగర్ తదితర ప్రాంతాల చర్చిల్లో పామ్ సండే నిర్వహించారు.

కవి సమ్మేళనంలో కొల్లూరికి సత్కారం



డాక్టర్ కొల్లూరికి ప్రశంసా పత్రాన్ని అందించి సత్కరించిన దృశ్యం

అమలాపురం టౌన్: హైదరాబాద్‌లోని శ్రీత్యాగరాయ గాన సభలో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, సింగపూర్ శ్రీ సాంస్కృతిక కళాసారధి, వంశీ ఇంటర్నేషనల్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ కవి సమ్మేళనంలో అమలాపురానికి చెందిన కవి, సాహితీవేత్త డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి పాల్గొన్నారు. సాహిత్యంపై ముఖ్యంగా కోనసీమ కీర్తిపై రాసిన తన పరిశోధన పత్రాన్ని డాక్టర్ కొల్లూరి ఆ సమ్మేళనంలో సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొల్లూరిని ఆ వేదికపై ప్రశంసాపత్రాన్ని అందించి ఘనంగా సత్కరించారు.

మానవ సంబంధాలను మెరుగుపర్చుకోవాలి

అమలాపురం టౌన్: సమాజంలో ప్రతి మనిషి మానవ సంబంధాలను మెరుగుపర్చుకుంటేనే అతని జీవితం సఫలమవుతుందని అమలాపురం ఓం శాంతి కేంద్రం బ్రహ్మకుమారి స్వరూప అన్నారు. స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఆదివారం ఉదయం నిర్వహించిన వాకర్స్ హెల్త్ క్లబ్ ఆరోగ్య సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారి స్వరూప మానవ సంబంధాలు అనే అంశంపై ఉపన్యసించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ ఆరోగ్య సదస్సులో వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, వాకర్స్ ఏరియా చీఫ్ కో ఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి, కార్యదర్శి గోటేటి లక్ష్మి, పుత్సా కృష్ణ కామేశ్వర్ పాల్గొన్నారు. అనంతరం బ్రహ్మకుమారి స్వరూపను వాకర్స్ క్లబ్ సభ్యులు సత్కరించారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్ నమోదు

అల్లవరం: 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ కులాలకు ఎస్సీ కులాల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఈ నెల 14 నుంచి 21 వరకు ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చుని ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అల్లవరం మండలానికి సంబంధించి 50 యూనిట్లు కేటాయించారని తెలిపారు. రూ.3 లక్షలలోపు 9 యూనిట్లు, రూ.3 నుంచి రూ.10 లక్షల వరకు 25 యూనిట్లు, మరియు ట్రాన్స్‌పోర్టు సెక్టార్–1లో 10 యూనిట్లు ఒక్కొక్కరికీ రూ.3 లక్షలు చొప్పున, ట్రాన్స్‌పోర్టు సెక్టార్–2లో రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు 6 యూనిట్లకు రుణాలు ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తెలుపు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణపత్రం, ఫొటోలతో మీ సేవ కేంద్రాల ద్వారా నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

వాలీబాల్ టోర్నమెంట్ విజేత వడ్డిగూడెం జట్టు

ఐ.పోలవరం: వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. కొమరగిరిలో బాబూ జగ్జీవన్‌రామ్– అంబేడ్కర్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో నియోజకవర్గస్థాయిలో 16 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో వడ్డిగూడెం విజేతగా, కొమరగిరి రన్నర్‌గా నిలిచాయి. ఆదివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పాల్గొని విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. విజేతలకు రూ. 10వేలు నడింపల్లి సూర్యవర్మ, రన్నర్స్‌కి దాట్ల పృథ్వీరాజ్ రూ. ఐదువేలు నగదు బహుమతి అందించారు. విజేతలకు ట్రోఫీలు, పతకాలను కలిదిండి రాజేష్ అందించారు. కార్యక్రమంలో శరత్ రాజు, గాదిరాజు బుచ్చి కృష్ణరాజు, పెన్మెత్స చంద్రశేఖర్ రాజు, పెన్మెత్స కిషోర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు

- ఎండలతో విలవిల్లాడుతున్న ప్రజలు
- నిర్మానుష్యంగా రహదారులు
- రాత్రి మంచు.. పగలు ఎండ తీవ్రత
- వ్యాధులు వ్యాపించే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



ఎండ తీవ్రత కారణంగా నిత్యం రద్దీగా ఉండే తాళ్లరేవు చెరువుగట్టు సెంటర్ ఆదివారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారిన దృశ్యం

తాళ్లరేవు: వేసవి ప్రారంభంలోనే ఎండలు దడ పుట్టిస్తున్నాయి. నాలుగు రోజులుగా ఎండల తీవ్రత కారణంగా జనం అల్లాడిపోతున్నారు. పగలు భానుడు భగభగలు జనాన్ని తీవ్ర ఇక్కట్లకు గురిచేస్తుండగా, రాత్రి వేళల్లో మంచు కురుస్తోంది. వాతావరణం మారుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. నాలుగు రోజులుగా తీవ్రస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో జనం అల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ప్రచండ భానుడు నిప్పులు కక్కుతుండడంతో జనం ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. దీంతో జన సంచారం లేక రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. భానుడు ప్రతాపం రోజురోజుకూ ఎక్కువ కావడంతో జనం ఇంటికే పరిమితమవుతున్నారు. దీంతో మండల పరిధిలో నిత్యం రద్దీగా ఉండే తాళ్లరేవు సంతపేట సెంటర్, చెరువుగట్టు సెంటర్, దేవీమహల్ సెంటర్, సుంకరపాలెం జంక్షన్ తదితర రహదారులు జనం లేక వెలవెలబోతున్నాయి. మధ్యాహ్నం వేళలో జన సంచారం లేక జాతీయ రహదారి 216 వెలవెలబోతుంది. సాయంత్రం ఐదు గంటలు దాటినా ఎండ తీవ్రత తగ్గకపోవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో వ్యవసాయ పనులకు వెళుతున్న రైతులు, రోడ్డు పక్కన ఉండే దుకాణదారులు, వ్యాపారులు హడలిపోతున్నారు.



వెలవెలబోతున్న సుంకరపాలెంలోని యానాం-ద్రాక్షారామ రహదారి

వాతావరణ మార్పులతో వ్యాధులు ప్రబలే అవకాశం

గాలి వేడిగా ఉండడం, అధిక మొత్తంలో చెమట పట్టడంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వేసవి తాపాన్ని తట్టుకోలేక, ఏసీలను, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. వేసవి తాపాన్ని తగ్గించుకునేందుకు జనం శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. పలుచోట్ల ఏర్పాటు చేసిన చలివేంద్రాల ద్వారా చల్లటి మజ్జిగను సరఫరా చేస్తుండడంతో వాటిని సేవించి పాదచారులు, వాహనదారులు వేసవితాపాన్ని తీర్చుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సిబ్బంది గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని తప్పనిసరి పరిస్థితులలో వెళ్లాల్సి వస్తే తలకు టోపీ, గొడుగు, ముఖానికి మాస్కులు ధరించి వెళ్లాలని వారు సూచిస్తున్నారు. రోడ్లపై అమ్మే కలుషిత ఆహారం తినరాదని, చల్లని రంగు పానీయాలు తాగరాదని చెపుతున్నారు. ప్రస్తుత వాతావరణం కారణంగా ఇటువంటి పదార్థాలు తీసుకోవడం ద్వారా డయేరియా (విరోచనాలు) తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.



చలివేంద్రం వద్ద చల్లటి మజ్జిగను పంపిణీ చేస్తున్న దాతలు

జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రస్తుతం వాతావరణ మార్పు కారణంగా ప్రజలు తగ జాగ్రత్తలు పాటించకుంటే వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. ఎండలో అధికంగా తిరగడం ద్వారా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. కలుషిత నీరు, ఆహారం, రంగురంగుల పానీయాలు సేవించడం ద్వారా కూడా డయారియా వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి. ముఖ్యంగా ఎండ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ నీరు ఎక్కువగా తీసుకోవాలి. రోజుకు సుమారు 10 నుంచి 15 గ్లాసులకు పైగా నీటిని తాగాలి. పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లతోపాటు చల్లటి మజ్జిగ, బార్లీ, తదితర పానీయాలను అధికంగా తీసుకోవాలి.

– డాక్టర్ ఈశ్వర్, పీహెచ్‌సీ వైద్యుడు, తాళ్లరేవు మండలం

ఆధ్యాత్మిక, సేవాగుణాలు అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ఇస్కాన్ రాజమహేంద్రవరం ప్రతినిధి సత్య గోపీనాథ్ దాసుప్రభు

అమలాపురం రూరల్: ఆధ్యాత్మిక, సేవాగుణాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని అంతర్జాతీయ శ్రీ కృష్ణ సంఘ ఆధ్యాత్మిక ఇస్కాన్ రాజమహేంద్రవరం ప్రతినిధి సత్య గోపీనాథ్ దాసుప్రభు పేర్కొన్నారు. జనుపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ కృష్ణ మందిర నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత యాంత్రిక జీవన విధానంలో మనిషి అనేక ఒడిదొడుకులకు, ఒత్తిడికి గురవుతున్నారని ఆయన అన్నారు. అందుకు కారణం మనిషి భగవద్గీతలో శ్రీ కృష్ణుడు ప్రబోధించిన ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను విడనాడి స్వార్థ చింతనలు ఎక్కువ కావడం వల్ల ఎంత సంపాదించినా మానసిక శాంతి ఉండడం లేదన్నారు. సాటి మనుషుల పట్ల జాలి దయ, పరోపకారం, సామాజిక సేవ, భగవత్ ధ్యానం వంటివి అలవర్చుకోవాలన్నారు. రాజమహేంద్రవరం ఇస్కాన్ మందిరానికి అనుబంధంగా కోనసీమలో శ్రీ కృష్ణ మందిరం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ స్వామీజీల సత్సంగ ఉపన్యాసాలు, అన్నదానం, విద్యార్థులకు ఉచిత శిక్షణ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రాజమండ్రి ఇస్కాన్ టెంపుల్ మేనేజర్ శివానంద నిమాయి దాసు, రాజు పాల్గొన్నారు.

పీఏసీ సభ్యుడు విశ్వరూప్‌కు సత్కారం



విశ్వరూప్‌ను సత్కరిస్తున్న శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం ఆర్డినేటర్, పీఏసీ సభ్యుడిగా నియమితులైన రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు అభినందనాలు తెలిపారు. పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని చంద్రశేఖర్ (నాని) పి.గన్నవరం నియోజకవర్గం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు తోరం గౌతమ్ రాజా, నాయకులు ఉంద్రు వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ కొల్లాటి దుర్గాబాయి, ఎంపీటీసీలు నెల్లి ప్రసాద్ తదితరులు ఆదివారం భట్నవెల్లిలో విశ్వరూప్ నివాసంలో కలిసి సత్కరించారు.

ప్రజల పక్షాన పోరాటం చేయాలి

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీని బలోపేతం చేసి ప్రజల పక్షాన పోరాటం చేయాలని విశ్వరూప్ కోరారు. అమలాపురం రూరల్ మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా నియమితులైన సాకుర్రు సర్పంచ్ గుత్తుల చిరంజీవిరావు పార్టీ పీఏసీ సభ్యుడు, పార్లమెంట్ కోఆర్డీనేటర్, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ కలిశారు. అమలాపురం భట్నవెల్లిలో విశ్వరూప్ నివాసంలో చిరంజీవిరావు ఆదివారం మర్యాదపూర్వకంగా విశ్వరూప్‌ను పార్టీ నాయకులతో కలిశారు. చిరంజీవిరావును విశ్వరూప్ పూలమాలలు వేసి సత్కరించారు. విశ్వరూప్‌ను కలిసిన వారిలో జిల్లా వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ శ్రీహరి రామ్ గోపాల్, పార్టీ నాయకులు రాజులపూడి భాస్కర రావు, బొక్కా నరసింహమూర్తి పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిరంజీవిరావును సత్కరిస్తున్న విశ్వరూప్

విద్యార్థి విభాగం జోనల్ అధ్యక్షుడిగా రమేష్

అమలాపురం రూరల్: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన జిల్లెల్ల రమేష్ ను వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జోనల్ అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రమేష్‌కు జోనల్ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. జోనల్ అధ్యక్షుడిగా నియమితులైన రమేష్‌ను పార్టీ పీఏసీ సభ్యుడు పినిపే విశ్వరూప్‌ను ఆదివారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో పి. గన్నవరం నియోజకర్గం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు తోరం గౌతమ్‌రాజా, నాయకులు పెయ్యల సాయి పాల్గొన్నారు.

అసంపూర్తిగా జూనియర్ కాలేజీ నిర్మాణం

యానాం: నియోజకవర్గ పరిధిలో శివారు తీరప్రాంత గ్రామం గిరియాంపేటలో శ్రీరక్షా హరికృష్ణ జూనియర్ కళాశాల నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేశారని, పనులను త్వరితగతిన పూర్తిచేయాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం కళాశాలను ఆయన సందర్శించి మాట్లాడుతూ 2025–26 నూతన విద్యా సంవత్సరంలో తరగతులు ప్రారంభించే నాటికల్లా పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడబ్ల్యూడీ అధికారులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ: ఇటీవలి కాంద్రకోటలో నూకాలమ్మ జాతరకు వెళ్లి కాలువలో స్నానానికి దిగి మునిగిపోయి మృతిచెందిన గిరియాంపేటకు చెందిన కొప్పాడి బాలు, తిరుమాని విశాల్ కుటుంబ సభ్యులను మల్లాడి పరామర్శించారు. ఆయా కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటానని హామీ ఇచ్చారు.

మెట్టకూరు హైస్కూల్ గ్రౌండ్‌లో వేసవిలో క్రికెట్ టోర్నీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో గ్రౌండ్‌ను ఆటలకు అనుకూలంగా తీర్చి దిద్దాలని మల్లాడి కృష్ణారావు ఆదేశించారు. ఆదివారం ఆయన హైస్కూల్ గ్రౌండ్‌ను ఏఈ నాగరాజుతో కలిసి పరిశీలించారు.

తీర ప్రాంతాల్లో సందర్శకుల రక్షణకు చర్యలు

అల్లవరం: తీరం ప్రాంతానికి వచ్చే సందర్శకుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కోస్టల్ అడిషనల్ ఎస్పీ మదుసూధనరావు అన్నారు. ఓడలరేవులోని సముద్ర తీర ప్రాంతాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ఓడలరేవు తీరం పర్యాటకులను ఆకర్షిస్తోందన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు ఓడలరేవు తీరానికి వస్తున్నారన్నారు. ముఖ్యంగా కార్తీక మాసంలో ప్రతి రోజు వందలాది మంది పర్యాటకులు, భక్తులు ఇక్కడ వచ్చి సముద్ర స్నానాలు చేస్తున్నారని తెలిపారు. ఓడలరేవుతో పాటు అంతర్వేది, భైరవపాలెంలో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటోందన్నారు. తీరంలో మెరైన్ పోలీసులు నిత్యం గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని అడిషనల్ ఎస్పీ తెలిపారు. మెరైన్ సీఐ వీఎస్ఎన్ మూర్తి, ఎస్సై శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఓడలరేవు తీరాన్ని సందర్శించిన కోస్టల్ అడిషనల్ ఎస్పీ మదుసూధనరావు

సాహిత్యరంగంలో దాట్ల సేవలు ప్రశంసనీయం

యానాం: సాహిత్యరంగంలో తనదైన శైలిలో వివిధ రచనలు చేస్తున్న కళారత్న దాట్ల దేవదానం రాజు సాహిత్యసేవలు ప్రశంసనీయమైనవని పుదుచ్చేరి ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం ప్రముఖ కవి శిఖామణి అధ్యక్షతన స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రముఖ కవి, కథా రచయిత దాట్ల దేవదానం రాజు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ప్రతిష్టాత్మక కళారత్న(హంస) పురస్కారం అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని సాహిత్య సాంస్కృతిక సంస్థ కవి సంధ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. రచయిత, సంపాదకులు పొనుగుమట్ల విష్ణుమూర్తి, ప్రముఖ విద్యావేత్త, తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి చిరంజీవినీ కుమారి తదితరులు దాట్ల రచనలను కొనియాడారు. రిటైర్డ్ ఆర్‌పీఓ నామాడి అప్పారావు, ఈలప్రోలు విష్ణువర్ధనరావు, మధునాపంతుల సత్యనారాయణ మూర్తి, డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర

తాళ్లరేవు: సుంకరపాలెం గ్రామ దేవత ముత్యాలమ్మవారి జాతర వైభవంగా నిర్వహిస్తున్నారు, అమ్మవారి జాతర మహోత్సవాల తొలిరోజు శ్రీ లక్ష్మీగణపతి వర్తక సంఘం ఆధ్వర్యంలో జాగారం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత అమ్మవారి అంగన్ గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. శక్తి వేషాలు, తీన్మార్ డప్పులు, గరగ నృత్యాలు, కోలాటాలతో జాతర కొనసాగింది.

సోమాలమ్మ జాతరకు శ్రీకారం

ఉప్పలగుప్తం: సోమాలమ్మవారి జాతరకు ఉప్పలగుప్తంలో కమిటీ సభ్యులు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అమ్మవారి చలువ పందిరికి రాట ముహూర్తం పూజలు చేసి పనులు ప్రారంభించారు. మే 2 నుంచి ఉత్సవాలను నాలుగు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

- 35 ఏళ్ల అనంతరం కలిసిన బాల్య స్నేహితులు
- అమలాపురం మున్సిపల్ హైస్కూల్లో సందడి

అమలాపురం టౌన్: బాల్యంలో కలిసి చదువుకున్న స్నేహితులంతా 35 ఏళ్ల అనంతరం కలిసి తమ ఆత్మీయతను పంచుకున్నారు. అమలాపురం వెత్సావారి అగ్రహారంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్లో 1986 నుంచి 1991 వరకూ అయిదేళ్ల పాటు విద్యనభ్యసించిన వారంతా అదే స్కూల్లో ఆదివారం కలిసి సందడి చేశారు. దాదాపు 80 మంది పూర్వపు విద్యార్థులు తమ కుటుంబీకులతో సహా హాజరై ఉదయం నుంచి సాయంత్రం వరకూ సరదాగా గడిపారు. బాల్య స్నేహితులను ఏరా..ఒరే అనుకుంటూ నాటి నిక్ నేమ్‌లతో పిలుచుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ వేడుకకు మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, ప్రధానోపాధ్యాయుడు బీఆర్ కామేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నేటి మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూలు 35 ఏళ్ల క్రితం పట్టణంలోని గండువీధిలో ఉండేదని పూర్వపు విద్యార్థి సలాది తిరుపతిరావు (నాని) పేర్కొన్నారు. కాలక్రమంలో ఇప్పుడు అదే హైస్కూలు వెత్సావారి అగ్రహారంలో సొంత భవనాలతో విస్తరించిందని స్పష్టం చేశారు. నాడు తమకు పాఠాలు చెప్పిన గురువులు యర్రమిల్లి పాండురంగారావు, ఎంఎల్ నరసింహరావు, బి.ఉమాదేవి, వి.భాగ్యలక్ష్మి, వెంగళదాసును పూర్వపు విద్యార్థులు ఘనంగా సత్కరించి వారికి పాదాభివందనాలు చేశారు. నాటి పూర్వపు విద్యార్థులు నేడు ఉద్యోగాలు, వివిధ వృత్తుల్లో దేశంలో అనేక ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వీరంతా ఒకేచోట కలుసుకునేందుకు ఈ ఆత్మీయ సమ్మేలనం వేదికగా మారింది. మహారాష్ట్ర రాష్ట్రం పూణెలో టీచర్‌గా స్థిరపడ్డ పూర్వపు విద్యార్థిని రాధా నీలమ సందడి చేశారు. సూదా నాగ శ్రీనివాసరావు, చంద్రమౌళి వీరభద్రశర్మ, సలాది తిరుపతిరావు, అయిల మల్లేశ్వరరావు, అల్లూరి శ్రీనివాసరాజు ఈ సమ్మేళనానికి ఆధ్వర్యం వహించారు. అనంతరం అందరూ కలిసి భోజనాలు చేసి ఆత్మీయతను చాటారు. పూర్వపు విద్యార్థులందరూ గ్రూపు ఫొటోకు దిగి తమ జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు.



అమలాపురం మున్సిపల్ హైస్కూల్లో కలిసిన 1986-91 బ్యాచ్ విద్యార్థులు

ఏరియా ఆస్పత్రికి అభివృద్ధి కమిటీ నియామకం

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి అభివృద్ధి కమిటీని నియమించారు. కమిటీ చైర్‌పర్సన్‌గా స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు వ్యవహరిస్తారు. కమిటీ సభ్యులుగా ఎంపీ గంటి హరీష్ మాథుర్, అమలాపురం ఆర్డీవో కె.మాధవి, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సీహెచ్‌వీ భారతలక్ష్మి, కమిటీ మెంబర్స్ కం కన్వీనర్‌గా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు నియమితులయ్యారు. కమిటీ సభ్యులుగా మహిళా సమాఖ్య నుంచి గెల్లా మీనా కుమారి, ఏపీఎంఎస్ఐడీసీ నుంచి సీహెచ్. రత్నరాజు, సోషల్ వర్కర్స్ నుంచి వలవల శివరావు, ఆవుపాటి వేణుగోపాల్, స్వయం సహాయక బృందం నుంచి గట్టెం పద్మావతి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కోనసీమ శాఖ నుంచి డాక్టర్ జీఎస్ఆర్‌కేజీ రంగారావు నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆస్పత్రి అభివృద్ధి కమిటీని నియమించి కలెక్టర్‌కు కమిటీలోని పేర్లను నివేదిస్తూ లేఖ పంపించారు. ఈ లేఖ ప్రతులను ఎమ్మెల్యే ఆదివారం విడుదల చేశారు.

వక్ఫ్ సవరణ చట్టం ఐక్యతకు విఘాతం

యానాం: మతతత్వంతో మాట్లాడేవారు దేశ ప్రజల ఐక్యతకు విఘాతంగా మారారని పుదుచ్చేరి ఎంపీ వైథిలింగం ఆరోపించారు. ఆదివారం వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో పుదుచ్చేరిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రం తీసుకువచ్చిన నూతన వక్ఫ్ సవరణ చట్టాన్ని ముస్లింలు వ్యతిరేకిస్తున్నారని కొత్త చట్టం ద్వారా వక్ఫ్ బోర్డుకు వచ్చిన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకునేలా వీలు కలిస్తుందన్నారు. కమిటీలో ఇద్దరు ముస్లిమేతరులను చేర్చడాన్ని వారు ప్రశ్నించారు. మాజీ సీఎం నారాయణసామి మాట్లాడుతూ ముస్లింలు, ఇతరులు విరాళంగా ఇచ్చిన భూమి నిర్వహణ, వక్ఫ్‌బోర్డులో హిందూ మతానికి చెందిన ఇద్దరిని నియమించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కందసామి, షాజహాన్, మాజీ ఎమ్మెల్యే అనంతరామన్, మహిళావిభాగం నేత నిషా పాల్గొన్నారు.

సామ్యూల్ సాగర్‌కు సత్కారం

యానాం: నియోజకవర్గ పరిధిలో మెట్టకూరులో మదర్‌సుశీల మెమోరియల్ బాప్టిస్టు చర్చి పాస్టర్, తాళ్లరేవు వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ రెవరెండ్ దొమ్మేటి సామ్యూల్‌సాగర్ బిషప్‌గా నామకరణం పురస్కారం పొందినందుకు ఆదివారం చర్చిలో ఆయనను క్రైస్తవులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనను మహిళలు, పెద్దలు, చిన్నారులు పూలమాలలు, దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు. పాస్టర్‌గానే కాకుండా అనాథ చిన్నారుల కోసం చిల్డ్రన్స్ హోమ్‌ను నిర్వహణతోపాటు, మహిళలకు కుట్టుశిక్షణ తదితర సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆయనను పలువురు ప్రశంసించారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

- 127 మంది దాతలు రక్తదానం

యానాం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక అంబేడ్కర్ విజ్ఞాన్ భవన్‌లో స్థానిక నాయకులు కనకాల రాజు, సబ్బతి లోకేశ్వరరావు, ముదే హరిశ్చంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 127 మంది దాతలు రక్తదానం చేసారు. ఈ సందర్భంగా ప్రారంభ కార్యక్రమానికి హాజరైన ఆర్ఏఓ మునిస్వామి మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని యువకులు పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని, అందరూ రక్తదానానికి ముందుకు రావాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తదితరులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్ఏఓలు నామాడి అప్పారావు, గిడ్డి బలరాం, మున్సిపల్ మాజీ చైర్మన్ గిడ్ల చంద్రరావు, సీఐ అడలరసన్, విజ్ఞాన్ భవన్ అధికారి కొల్లు నూకాంబరం, దళిత నాయకులు పొనుగుమట్ల విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

రేపటి నుంచి చేపల వేట నిషేధం

యానాం: చేపల వేట నిషేధం ఈనెల 15నుంచి జూన్ 14 వరకు 61 రోజుల పాటు అమలులో ఉంటుందని ఆదివారం ఆర్ఏఓ మునిస్వామి ఓ పేర్కొన్నారు. సముద్ర మత్స్య సంపదను దీర్ఘకాలికంగా పరిరక్షించేందుకు భారత ప్రభుత్వం సముద్రంపై చేపల వేట నిషేధించినట్లు తెలిపారు. యానాం నియోజకవర్గంలో సైతం చేపల వేటను నిషేధిస్తున్నట్లు తెలిపారు. యానాం పరిధిలో బోట్లు, తెప్పలు, నావలున్న మత్స్యకారులు సముద్రంలో ఈ 61 రోజుల పాటు చేపల వేటకు వెళ్లరాదని పేర్కొన్నారు. ఉత్తర్వులు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

కన్నుల పండువగా వేంకటేశ్వరునికి ఉయ్యాల సేవ

- ముగిసిన అమలాపురం వెంకన్న కల్యాణోత్సవాలు
- వైభవంగా శ్రీపుష్పోత్సవం

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పది రోజులుగా నిర్వహిస్తున్న స్వామివారి కల్యాణోత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. సాయంత్రం నుంచి రాత్రి వరకూ స్వామి, దేవేరులకు పలు సేవలు వైభవంగా నిర్వహించారు. తిరుమంజన సేవ, బుక్కా ఉత్సవం, ఉయ్యాల సేవోత్సవం కన్నుల పండువగా సాగాయి. దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న, స్వర్ణ కనకదుర్గ దంపతులు స్వామి, అమ్మవార్లకు ఉయ్యాల సేవ పూజలు నిర్వహించారు. తిక్కిరెడ్డి కృష్ణారావు సన్స్ ఆధ్వర్యంలో స్వామి, దేవేరులకు శ్రీ పుష్పోత్సవం నిర్వహించారు. దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కల్యాణోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. వేద పండితుడు సుదర్శనం మురళీకృష్ణాచార్యులు, దేవస్థానం ప్రధాన అర్చకులు పెద్దింటి లక్ష్మీ నరసింహాచార్యుల బ్రహ్మత్వంలో దాదాపు 20 మంది రుత్వికులు ఈ క్రతువులను నిర్వహించారు.



వేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

బుద్ధ విహార్‌లో ఛత్రపతి శివాజీకి ఘన నివాళులు

అమలాపురం రూరల్: ఛత్రపతి శివాజీ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక బుద్ధ విహార్‌లో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి మాజీ మంత్రి, రాజోలు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు పూలమాలవేసిన నివాళిలర్పించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. బుద్ధ విహార్ జనరల్ సెక్రటరీ డీబీ లోక్ అధ్యక్షతన నిర్వహించిన సభలో గొలపల్లి మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ పోరాట పటిమ, ప్రజారంజక పాలన గురించి ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బుద్ధ విహార్ చైర్మన్ నాగబత్తుల ప్రసాద్, పెనుమాల చిట్టిబాబు, కాశి వెంకటరావు, అడ్వకేట్ కే.రామ్మూర్తి పాల్గొన్నారు.



శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గొల్లపల్లి